క్లుప్తంగా

లోక కల్యాణం కోసం హోమాలు



పూర్ణాహుతి గావిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన స్పటిక లింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం జ్యైష్టమాసం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని యోగానంద పాములేటి స్వామి ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. ఉదయాన్నే స్పటిక లింగేశ్వరానికి ప్రత్యేకంగా అభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం హోమాలు జరిపించి పూర్ణాహుతి గావించారు. యోగానంద స్వామి మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి, జీవన విధానానికి మూలస్తంభం వ్యవసాయం అని దానికి పనిముట్లు నాగలి, వర్షం కోసం ఇంద్రుడిని పూజిస్తూ హోమాలు నిర్వహించారు. రఘునాథరెడ్డి, సుబ్బయ్య, శంకర్, వాసు,తిమ్మయ్య, యోగా సభ్యులు పాల్గొన్నారు.

అహోబిలంలో పౌర్ణమి పూజలు



ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ నిర్వహిస్తున్న పండితులు

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యపూజల అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను దిగువ అహోబిలం ఆలయ ఆవరణలోని అద్దాల మండపం ముఖద్వారంలో ఏర్పాటు చేసిన యాగశాలలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి దూపదీపాలతో మహామంగళహారతి ఇచ్చి నైవేద్యం నివేదించారు. రాత్రి విశేషాలంకరణలో స్వామి ఉభయ దేవేరులతో కొలువుదీరి మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాయలూరు ఉన్నత పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రధానోపాధ్యాయుడు హుసేన్సా అన్నారు. శనివారం మండలంలోని మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో ప్రతి విద్యార్థి మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకుంటే వారే వాటిని సంరక్షిస్తారని చెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: రుద్రవరం-అప్పనపల్లె దారిలో వెలసిన వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు లక్ష్మీ, గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి ఉదయాన్నే నిత్య పూజలు గావించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తాదులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.

'నీట్' అవకతవకలపై విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ సన్నాల సాయి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సరస్వతి నగర్‌లో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఒకే సెంటర్‌లో పలువురికి ఒకే ర్యాంక్, మార్కులు రావడం ఆశ్చర్యకరమన్నారు. కేంద్ర వైద్య శాఖ మంత్రి, దేశ ప్రధాని స్పందించి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరారు. నాయకులు సంపత్, శివ, షాకీర్, పవన్ పాల్గొన్నారు.

వరి సాగుకు సన్నద్ధం

- పొలాల్లో ఏపుగా పెరుగుతున్న జీలుగ
- మడుల్లో సిద్ధమవుతున్న వరి నారు
- బురద సేద్యపు పనులు షురూ చేసిన రైతులు



చిత్రేనిపల్లె వద్ద బురద సేద్యం చేస్తున్న ట్రాక్టర్



నారుమడిలో ఎద్దుల కాడితో చదును చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని ఆలమూరు,చిత్రేనిపల్లె,ముకుందాపురం,అప్పనపల్లె సుగాలి తండా, అప్పనపల్లె, డీ.కొట్టాల,చిన్నకంబలూరు తదితర గ్రామాల పరి ధిలోని రైతులు బోర్ల కింద వరి పంట సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందస్తుగా మంచి వర్షాలు కురిశాయి.దీంతో అడుగంటిన భూగర్భ జలాలు మళ్లీ పైకిరావడంతో బోర్ల నుంచి నీరు సమృద్ధిగా అందుతోంది. వాటికి తోడు భూసారం పెంచుకునేందుకు ప్రభుత్వం రాయితీ జీలుగలు మంజూరు చేయడంతో వెంటనే కొని పొలాల్లో చల్లారు. ప్రస్తుతం జీలుగ ఏపుగా పెరుగుతోంది.

జీలుగల మంజూరు..

వరి పంట సాగు చేసే రైతులు జీలుగల కోసం అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి జీలుగలకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. దీంతో ఆయా గ్రామాల రైతులు 1205 మంది రాయితీ జీలుగల కోసం దరఖాస్తు చేశారు. ప్రభుత్వం 450 క్వింటాళ్ల జీలుగలు మంజూరు చేసింది. అందులో మొదటి విడతగా 210 క్వింటాళ్లు రాగా అధికారులు వాటిని రైతులకు పంపిణీ చేశారు. త్వరలోనే మిగిలిన 240 క్వింటాళ్లు వస్తాయని అధికారులు చెబుతున్నారు. జీలుగలు తీసుకున్న రైతులు తమ పొలాల్లో చల్లారు. అవి ఏపుగా పెరుగుతుండగా ఓ వైపు పొలాల్లో బురద సేద్యం పనులు చేపట్టారు. అందులో ఓ కయ్యను నారుమడిగా సిద్ధం చేసి వడ్లు చల్లారు. మడుల్లో నారు వేగంగా పెరుగుతోంది. కాగా ఈ నెలఖారులోపు వరి నాట్లు వేసేందుకు అవసరమైన ఎరువులు సిద్ధం చేసుకుంటున్నారు.

వరి సాగుపై రెట్టించిన ఆశలు..

మండలంలోని రైతులు రెట్టించిన ఆశలతో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఖరీఫ్,రబీ సీజన్లలో మంచి దిగుబడులు సాధించారు. వాతావరణం అనుకూలించడం, తెగుళ్లు పెద్దగా సోకక పోవడంతో నాణ్యమైన దిగుబడులు వచ్చాయి. ఆ దిగుబడులకు తగ్గట్టుగానే ధర లభించింది. పసిమి ఉండగానే క్వింటా దాదాపు రూ.2వేలకు తగ్గకుండా విక్రయించి మంచి లాభాలు గడించారు. ఆ ఆశతో ఈ ఏడాది కూడా ముందస్తుగా వరి సాగు చేసి మంచి దిగుబడులు సాధించేందుకు ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో దిగారు. గతేడాది ఖరీఫ్‌లో దాదాపు 5వేల హెక్టార్లు, రబీలో 3వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు.



ముకుందాపురం వద్ద కయ్యల్లో పెరుగుతున్న జీలుగ



ఆలమూరు వద్ద సాగు చేసిన వరి నారు



రైతు భరోసా కేంద్రం నుంచి జీలుగలు తీసుకెళ్తున్న రైతులు

26 నుంచి సోషల్ ఆడిట్

గోస్పాడు: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో చేపట్టిన పనులు, చేసిన ఖర్చుపై ఈనెల 26వ తేదీ నుంచి డీఆర్పీలు గ్రామాల్లో పర్యటించి ఆడిట్ చేస్తారని ఏపీఓ నాగజ్యోతి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. 972 పనులకు రూ.7.04 కోట్ల ఖర్చుపై ఎస్ఆర్‌పీ కాంతరావు ఆధ్వర్యంలో 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి వరకు 18వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు 9 మంది డీఆర్పీలు గ్రామాల్లో ఉపాధి పనులపై తనిఖీ చేస్తారని, తనిఖీ అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామాల వారీగా.. ఈనెల 26న ఎస్.నాగులవరం, పసురపాడు, 27న గోస్పాడు, ఎం.కృష్ణాపురం, సాంబవరం, ఒంటివెలగల, 29న దీబగుంట్ల, యాళ్లూరు, జిల్లెల్ల, 30న ఎం.చింతకుంట్ల, 1న కానాలపల్లె, జూలేపల్లె, రాయపాడు, తేళ్లపురి, నెహ్రూనగర్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారని వివరించారు.

వర్మీకంపోస్టు తయారీపై శిక్షణ

మహానంది: వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా ఎరువుగా మార్చుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మహానంది వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రవికిశోర్ తెలిపారు. తమ్మడపల్లె గ్రామంలో శనివారం వానపాముల ద్వారా ఎరువు తయారీకి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వానపాముల ద్వారా తయారు చేసుకునే వర్మీకంపోస్టుతో మేలైన దిగుబడులు పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన రైతులకు కళాశాలలోని వానపాముల ఎరువుల తయారీ వద్ద శిక్షణ ఇస్తామన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం





ఎస్.కొత్తపల్లెలో వన్నూర్‌సాను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ పోచా, మాజీ ఎమ్మెల్యే గంగుల, హుసేన్‌సాను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

ఉయ్యాలవాడ : సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం తమకు ఓటు వేయలేదన్న నెపంతో మండలంలోని ఎస్.కొత్తపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలైన వన్నూర్‌సా, హుసేన్‌సాలపై వారం రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడి చేశారు. ఘటన గురించి తెలుసుకున్న మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శనివారం సాయంత్రం గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, భయపడాల్సిన అవసరం లేదని అభయమిచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. శాంతియుతమైన గ్రామాల్లో మళ్లీ అలజడులు సృష్టించడం బాధాకరమన్నారు. గ్రామాలలో టీడీపీ నాయకులు దాడులకు వెళ్లకుండా అభివృద్ధిపై దృష్టి సారిస్తే ప్రజలు హర్షిస్తారని హితవు పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కూలూరు రామకృష్ణారెడ్డి, నాయకులు మిట్టా నారాయణరెడ్డి, పోచా రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



రైతులకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

రుద్రవరం: విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు ఇవ్వాలని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చిన్నకంబలూరు మెట్ట వద్దనున్న కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో శనివారం ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని రుద్రవరం,శిరివెళ్ల,గోస్పాడు మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వారీగా విత్తనాలు,ఎరువులు అందించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల వారీగా రైతులకు జీలుగలు, మినుములు, కందులు వంటి విత్తనాలు ఏ మేరకు అవసరమో గుర్తించాలని, అలాగే పంటల సాగు విస్తీర్ణం తెలుసుకొని అవసరమైన రసాయన ఎరువులు నిల్వ చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులను గుర్తించి వారికి సాగు ధృవీకరణ పత్రాలు అందజేయాలని చెప్పారు. ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగేంద్ర ప్రసాద్, ఏఓలు శ్రీకృష్ణ, స్వప్నిక ఉన్నారు.

జీలుగల పంపిణీ: మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో శనివారం జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు రాయితీ జీలుగలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 450 క్వింటాళ్ల జీలుగలు మంజూరయ్యాయన్నారు.ఇప్పటి వరకు 955 మంది రైతులకు 330 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన జీలుగలను కూడా దరఖాస్తు చేసుకున్న రైతులకు అందజేస్తామని చెప్పారు. విస్తరణ అధికారి రాజు, వీఏఏ చాణిక్యుడు, రైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీను, నాగేష్, వెంకటేశ్వర్లు, నాగయ్య, కిట్టు ఉన్నారు.

సెల్‌ఫోన్ రేడియేషన్‌పై అవగాహన



ఫిజియోథెరపీకి ఉపయోగించే పరికారాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

చాగలమర్రి: ప్రజలు సెల్‌ఫోన్ రేడియేషన్ బారిన పడకుండ జాగ్రత్త వహించాలని హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజియోథెరపీ వైద్య నిపుణులు రమేష్, మహేశ్ సూచించారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మెడ, మోకాలి, నడుము నొప్పులు రాకుండా ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి, సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించడం వలన ఎలాంటి దుష్ఫలితాలుంటాయి, రేడియేషన్ బారిన పడకుండా ఎలాంటి జాగత్తలు తీసుకోవాలి, అలాగే ఎలాంటి ఆహారం, నీరు తీసుకోవాలనే వాటి గురించి వైద్యులు వివరించారు. కాగా.. సెల్‌ఫోన్ రేడియేషన్ బారి నుంచి కాపాడేందుకు హైదరాబాద్ నగరానికి చెందిన నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజియోథెరపీ వైద్య నిపుణులు రమేష్, మహేశ్ మన రాష్ట్రంలో జిల్లా విద్యా శాఖాధికారులతో అనుమతి పొంది స్వచ్ఛందంగా ఈ అంశంపై ప్రతి మండలంలో ఒక గంట పాటు ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి ఫిజియోథెరపీపై అవగాహన కల్పిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్న చిన్నారులతో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

నంద్యాల(అర్బన్): ఆటపాటల విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ కేంద్రలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు నజీర, సుజాత, అనురాధ తెలిపారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని నూనెపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లోని 5 -6 సంవత్సరాలు నిండిన చిన్నారులను నూనెపల్లె పొట్టిశ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో వేల రూపాయలు వసూలు చేసి అందించే ఎల్‌కేజీ, యూకేజీ విద్యను అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. అనంతరం మున్సిపల్ పాఠశాలలో చేరే చిన్నారులకు కాన్వకేషన్ సర్టిఫికెట్లను అందజేశారు.

కొత్తపల్లెలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే..

మండలంలోని కొత్తపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను సూపర్‌వైజర్ విజయ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులను స్థానిక ఎంపీపీ పాఠశాలలో చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌డాడీ కేంద్రాల్లో చేర్పించాలని, ఐదేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేస్తున్నామని చెప్పారు.

మౌనస్వామి ఆశ్రమంలో చండీ హోమం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మౌనస్వామి ఆశ్రమంలో శనివారం మూలనక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి లోక కళ్యాణార్థం చండీ హోమాన్ని నిర్వహించారు. దేశ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని సంకల్పిం పఠించారు. హోమం అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఆశ్రమ నిర్వాహకురాలు మంజుల, బీజేపీ జిల్లా బీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సుమలత, ఆశ్రమ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, అఖిల భారత వీరసేవ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మంజునాథ్, రాష్ట్ర హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏరువాక పూజలు

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరులో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు ఆధ్వర్యంలో ఏరువాక సంబరాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రైతుల సమక్షంలో ఎద్దుల కాడి, వ్యవసాయ పనిముల్లు, భూమాతకు పూజలు చేసి ఏరువాకను ప్రారంభించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రకృతి,పాలకుల సహకారం ఉంటేనే వ్యవసాయ రంగం వృద్ధిలోకి వస్తుందన్నారు. రైతులు మచ్చకంటి గోపాల్, బత్తులూరు రాంపుల్లయ్య, తలారి నాగేష్, కృష్ణారెడ్డి,నాగయ్య,దయ్యాల హరి,చంద్రసేన,సంజీవ పాల్గొన్నారు.



చిన్నకంబలూరులో ఏరువాకను ప్రారంభిస్తున్న రైతులు

టమాటా!



నంద్యాల(అర్బన్): టమాట ధర పైపైకి ఎగబాకుతోంది. ప్రస్తుతం కిలో హోల్‌సేల్ రూ.80 లభిస్తుండగా, రిటైల్‌గా రూ.100 ప్రకారం విక్రయిస్తున్నారు. పల్లెల్లో రూ.110 నుంచి రూ.120 వరకు అమ్ముతున్నారు. కొద్ది రోజుల క్రితం రూ.20 నుంచి రూ.40 వరకు పలికింది. అయితే ఒక్కసారిగా రూ.60 ఆ తరువాత రూ.80 నుంచి రూ.100 చేరింది. రోజుల వ్యవధిలోనే ధర మారుతుండటంతో వినియోగదారుల నోట మాట రావడం లేదు. రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే ఆస్కారముందని వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవి తీవ్రత దృష్ట్యా పంట దిగుబడులు తీవ్రంగా తగ్గిపోవడంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ సాగు తగ్గిందని పేర్కొంటున్నారు.

నేత్రదానం.. ఇద్దరికి చూపు



మృతురాలి నుంచి నేత్రాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన సోమ సుబ్బలక్ష్మమ్మ మరణించినా తన కళ్లను దానం చేసి మరో ఇద్దరికి కంటి చూపును కలిగించి ఆదర్శంగా నిలిచింది. సుబ్బలక్ష్మమ్మ కుమారుడు నాగేంద్ర మాట్లాడుతూ ఈ లోకంలో తాను లేకపోయినా తన కళ్ల మరో ఇద్దరికి చూపును ఇవ్వాలని కోరిందని, యోగా గురువు ఖండే ఆనంద్ గురూజీ చొరవతో తన తల్లి ఆశయాన్ని నెరవేర్చానని చెప్పారు. ఆనంద్ గురూజీ మాట్లాడుతూ మన తర్వాత అవయవాలను మట్టిలో కలిసి పోనివ్వకుండా దానం చేసి మరో పదిమంది ప్రాణాలను కాపాడాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: అహోబిలం గ్రామంలో శనివారం లక్ష్మయ్య(20) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి మందలించాడని ఎగువ అహోబిలం బైపాస్ రోడ్డులోనున్న రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపారు.



కుందూ నదిలో జలకళ



మొక్కజొన్న నాటుతున్న కూలీలు



మినుము పంటకు ఊపిరి..

వర్షం వచ్చాక..

దొర్నిపాడు: సుమారు ఏడు నెలల కాలంగా రైతులు వరుణుడి కోసం వేచి చూశారు. గతేడాది తీవ్ర వర్షాభావం కారణంగా పశువులకు పచ్చిగడ్డి కరువైంది.. జలాశయాలు ఎండిపోయాయి.. పొలాల్లో పంటలు సక్రమంగా పండలేదు.. రైతు కూలీలకు పనుల్లేవు.. చివరకు తాగునీటికి తీవ్ర ఇక్కట్లు ఎదురయ్యాయి. అయితే ముందస్తుగా తొలకరి మొదలవడం, వరుసగా భారీ వర్షాలు కురవడంతో కుంద నది జలకళను సంతరించుకుంది. వ్యవసాయ కూలీలకు చేతినిండ పని లభిస్తోంది. ప్రస్తుతం మొక్కజొన్న, పత్తి విత్తనం వేయడం, పొలాలను విత్తనానికి సిద్ధం పనుల్లో రైతులు, కూలీలు బిజీగా మారారు. ఇక వరుణుడి రాకతో పచ్చగడ్డి మొలకెత్తడంతో పశువులకు గ్రాసం లభిస్తోంది. ఇటీవల సాగు చేసిన మినుము పంటకు ప్రాణం పోసింది. అంతేకాకుండా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తీరాయి. వాగులు, వంకలు పారడంతో పశువులు, అడవి జంతుజీవాలకు నీరు పుష్కలంగా అందుబాటులో ఉంది. వర్షాలు కొనసాగితే ఖరీఫ్‌లో సిరులు పండించాలని రైతన్నలు ఆశలు సేద్యం మొదలుపెట్టారు. మండలంలో అధికంగా మొక్కజొన్న, మినుము సాగు చేస్తున్నారు. చుక్కనీరు లేని కుందూ నది నిండుగా ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాల రైతులు వరినారు పోసుకుంటున్నారు. అలాగే భూగర్భ జలాలు పైకి రావడంతో బోర్ల నుంచి నీటిదార పెరిగింది. దీంతో వరి సాగుకు ఇక్కట్లు తీరినట్లేనని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.